TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 46 | మంగళవారం, మే 28, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



2వ పేజీలో...

జగన్ సర్కార్‌పై నిరుద్యోగుల

## స్పందన

డిఎస్సీ, ఉద్యోగాల కల్పనలో విఫలంపై నిరాశ
4న ఫలితాలతో వెల్లడి కానున్న మనోగతం

అమరావతి, : మరో నాలుగౌఐదు రోజుల్లో..అంటే జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికలు జగన్ సమర్థతకు పరీక్ష కాబోతున్నాయి. సిఎంగా యాన 99శాతం పనులు లేదా హామీలు పూర్తి చేశానిన ప్రకటించారు. పనులు లేదా హామీలంటే నేరుగా డబ్బులు వేయడం అన్నది ఆయన నిఘంటువు అర్థం. డబ్బులు వేయడమే పాలన అయితే అందుకు సిఎంలు అవసరం లేదు. ప్రభుత్వం కూడా అసవరం లేదు. గత ఐదేళ్లో రాష్ట్రం పూర్తిగా దివాళా తసింది. 7లక్షల కోట్లకు పైగానే అప్పులు చేసినట్లు తేలింది. నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బులు వేసేందుకు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. మటట్ఇ, ఇసుక, మద్యం, గంజాయి వ్యాపారాలు బాగుపడ్డాయి.



2వ పేజీలో...

బెయిల్ వారం రోజులు

## పొడిగించండి

సుప్రీంను అభ్యర్థించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ, : లోక్‌సభ ఎన్నికలనేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ తన మధ్యంతర బెయిల్‌ను 7 రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే అరవింద్ కేజ్రీవాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారని అందుకే పొడిగించాలని చెప్పారు. తనను అరెస్ట్ చేసిన తర్వాత బరువు 7 కిలోలు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. అందుకే తాను పీఈటీ-సీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో టెస్టులు చేయించుకోవడానికి మరో 7 రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టును కోరారు.

## తెలంగాణపై తుఫాన్ ప్రభావం!!



2వ పేజీలో...

ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం
పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



2వ పేజీలో...

ఛత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్

## హింస

రెండు సెల్ టవర్లు దగ్ధం

రాయ్‌పూర్, : ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లతో రెచ్చిపోయిన నక్సలైట్లు ఆదివారం అర్ధరాత్రి మరో దారుణమైన ఉదంతానికి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో నిర్మాణంలో ఉన్న రెండు బీఎస్ఎన్ఎల్ టవర్‌లకు నిప్ప పెట్టారు. ఆ తర్వాత నక్సలైట్లు పలు బ్యానర్లు, పోస్టర్లను కూడా అక్కడ వేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని చమేలీ గ్రామం పరిధిలో చోటుచేసుకుంది. ఛోటాదొంగర్ పోలీస్ స్టేషన్‌కు 4 కిలోమీటర్ల దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం విశేషం. దీంతో ఆ ప్రాంతంలో జిల్లా పోలీసు బలగాలు, ఐటీబీ అధికారులు సోదాలు చేస్తున్నాయి. టవర్‌ను త్వరలో ప్రారంభించబోతున్నారని తెలిసి నక్సలైట్లు దానికి నిప్పుపెట్టారని భద్రతా బలగాలు తెలిపాయి.

బంగ్లా లో తీరం దాటిన



2వ పేజీలో...

## రీమాల్ తుఫాన్

కోల్‌కతా/విశాఖపట్టణం, : తీవ్ర తుఫానుగా బలపడిన 'రెమాల్' పశ్చిమబెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్, బంగ్లాదేశ్‌లోని మంగ్లా పోర్టు సమీపంలోని ఖేపుపుర మధ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటలకు 120-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

ఈదురుగాలులతో బంగ్లాదేశ్ అతలాకుతలం
తెలుగు రాష్ట్రాల్లోనూ విపరీతంగా ఈదురుగాల వర్షం
మొత్తం 15మంది చనిపోయి ఉంటారని అంచనా...

ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన

## ఏర్పాటు

న్యూఢిల్లీ, : విభజన సందర్భంగా ఎపికి ఒనగూర్చే ప్రయోజనాల విషయంలో కేంద్రం ఓ రకంగా చేతులు ఎత్తేసిందనే చెప్పాలి. కానీ చాలానే చేశామని బిజెపి ప్రకటించుకుంది. పైగా విశాఖ ఉక్కును తెగనమ్మే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి వైఫల్యాలు అనేకం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా ఒక్కటంటే ఒక్క మేలు చేయలేదు. అయినా ఎపిలో గణనీయంగా సీట్లు గెల్చుకో బోతన్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వచ్చేది ఎన్డీయే సర్కారేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.



వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే
ఎండాకాలం ఎన్నికలకు ఇక ముగింపు పలుకుతాం
జమిలి ఎన్నికలతో వరుస ఎన్నికలకు స్వస్తి
కేంద్రహోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ




ఎన్నికల కౌంటింగ్‌కు

## పక్కాగా ఏర్పాట్లు

రాష్ట్ర అధికారులకు కేంద్ర ఇసి ఆదేశాలు

హైదరాబాద్, :ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 4న ఓట్ల లెకింపు ఏర్పాట్లపై ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ కుమార్ వ్యాస్ అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో ప్రత్యేకం గా సమీక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగా ల్, బీహార్ రాష్ట్రాల సీఈవోలు తమ రాష్ట్రా ల్లో తీసుకున్న చర్యలను వివరించారు. కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఈ వో వికాస్‌రాజ్ ఈ సందర్భంగా తెలిపారు. కౌంటింగ్ అధి కారులకు మొదటి రౌండ్ శిక్షణ మంగ ళవారం పూర్తవుతుందని వెల్లడించా రు. ఈసీఐ ద్వారా 47 మంది పరిశీలకులను రాష్ట్రానికి పంపిస్తు న్నట్టు డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ వ్యాస్ తెలియజేశారు.సమావేశంలో అదనపు సీఈవో డీఎస్ లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవోలు పాల్గొన్నారు.



2వ పేజీలో...

పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరిన గ్రాడ్యుయేట్లు
సూర్యాపేటలో ఓటేసిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

ప్రశాంతంగా ఎమ్మెల్సీ

## ఉప ఎన్నిక

వరంగల్, : వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. అన్ని చోట్ల ఎలాంటి సమస్యలూ లేకుండా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా 118 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

**మొదటిపేజీ తరువాయి...**

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఖఖమ్మం నగరంలో 57 పోలింగ్ కేంద్రాలున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రారంభం అయ్యింది. పోలింగ్ కోసం 129 బ్యాలెట్ బాక్సులను అధికారులు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌తో పోలింగ్ పక్రియ నిర్వహిస్తున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు నల్గొండలోని స్ట్రాంగ్ రూంకు తరలింపునకు అధికారులు ఏర్నాట్లు చేసారు. 12 జిల్లాల్లో ఈ పోలింగ్ కొనసాగుతోంది. బ్యాలెట్ ద్వారా పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మొత్తం ఓటర్లు 4,63,839, 605 కాగా.. పోలింగ్ కేంద్రాలు, 807 బ్యాలెట్ బాక్సులున్నాయి. పురుష ఓటర్లు...2 లక్షల 88 వేల 189 మంది, మహిళలు లక్ష 75 వేల 645 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. 'ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్' పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ 5న లెక్కించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. బరిలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి పోటీపడుతున్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మొత్తం 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని గ్రాడ్యుయేట్స్ ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం అధికారులు మొత్తం 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని 4,63,839 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 457 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఆయన తొలి ఓటు వేశారు. ఈ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 673 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ ప్రారంభానికి ముందే బూత్‌కు వచ్చిన జగదీశ్ రెడ్డి తొలి ఓటు వేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లను లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరుసటి రోజైన జూన్ 5న లెక్కించనున్నారు.

# తెలంగాణపై తుఫాన్ ప్రభావం!!

**మొదటిపేజీ తరువాయి...**

హైదరాబాద్, : తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని పలు జిల్లాలకుఎల్లో అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ వెల్లడించింది. రెమాల్ తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారి తీవ్ర తుఫాన్ గా మారింది.. నిన్న సాగర్ ఐలాండ్ వద్ద తుఫాన్ తీరం దాటింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, సూర్యాపేట్, నల్గొండ,



కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, భద్రాది కొత్తగూడెం జిల్లాలకు నేడు వర్ష కురిసే అవకాశం ఉంది. 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.రేపు..ఎల్లుండి రాష్ట్రంలోపొడివాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉంటే.. ఆదివారం తెలంగా ణలో రెమాల్ తుఫాన్ బీభత్సం సృష్టించింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లోబలమైన గాలులువీచాయి. దీంతో పలుచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరి గాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మద్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కలిపి నల్గొండ, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో గాలివాన కురిసింది. వేర్వేరు ఘటనల్లో మొత్తం 14 మంది చనిపోయారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వర్షాలు, ఈదురుగాలులకు రాష్ట్రంలో 14 మంది మృతి చెందారు. నాగర్ కర్నూలు జిల్లాలో 8 మంది మృతి చెందగా.. శామీర్ పేటలో చెట్టు విరిగిపడి ఇద్దరు మృతి చెందారు. మియాపూర్ లో గొడ కూలి మూడేళ్ల బాలుడు, సిద్ధిపేట జిల్లా క్షీరసాగరలో ఇద్దరు మృతి చెందారు.

# బెయిల్ వారం రోజులు పొడిగించండి

**మొదటిపేజీ తరువాయి...**

అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. సుప్రీంకోర్టు జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ(ఇఅ) అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. దాపు 51 రోజుల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు అయనకు 21 రోజులు మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ప్రభుత్వం 2021-22కి సంబంధించిన లిక్కర్ పాలసీని రూపొందించి అమలు చేయడంలో అవినీతి, మనీలాండరింగ్ జరిగిందని ఈ కేసులో ఆరోపణలున్నాయి.

# ఛత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్ హింస

**మొదటిపేజీ తరువాయి...**

అంతేకాదు ఛోటెడోంగర్‌కు చెందిన పద్మశ్రీ వైద్యరాజ్ హేమచంద్ర మాంఝీని బ్రోకర్‌గా అభివర్ణించి దేశం నుంచి వెళ్లిపోవాలని నక్సలైట్లు( బెదిరించారు. ఇప్పటికే పద్మశ్రీ హేమచంద్ర మాంఝీ మేనల్లుడు కోమల్ మాంఝీని నక్సలైట్లు దారుణంగా హత్య చేశారు. వైద్యరాజ్ హేమచంద్ర మాంఝీని బ్రోకర్ అని ఆరోపిస్తూ బెదిరిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని సేఫ్ హౌస్‌లో వైద్యరాజ్‌కు పోలీసు యంత్రాంగం భద్రత కల్పించింది.

ప్రాంతంలో బీజేపీకి చెందిన ముగ్గురు కీలక నేతలను నక్సలైట్లు ఇప్పటికే హతమార్చారు. వారిలో సాగర్ సాహు, రతన్ దూబే, పంచమ్ దాస్ ఉన్నారు. బీజేపీ నేతల హత్య అనంతరం ఆయా ప్రాంతాల్లో ఉంటున్న కీలక నేతలను జిల్లా కేంద్రానికి తరలించి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు నక్సలైట్ల హిట్ లిస్ట్‌లో ఉన్న నేతలు, గ్రామస్తులకు కూడా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. వారిలో పలువురు కాంగ్రెస్ నేతలు కూడా ఉన్నారు.

# ఎంఐఎం పార్టీ నేతపై కాల్పులు

## మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఘటన

నాసిక్, : ఎంఐఎం పార్టీ నేతపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఓ పెట్రోల్ పంపు సమీపంలో మాలెగావ్ మాజీ మేయర్ అబ్దుల్ మాలిక్‌పై కాల్పులకు పాల్పడ్డారు. బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ) పార్టీకి మాలిక్ ప్రముఖ నాయకుడిగా ఉన్నారు. ఎంఐఎం పార్టీ నేతపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఓ పెట్రోల్ పంపు సమీపంలో మాలెగావ్ మాజీ మేయర్ అబ్దుల్ మాలిక్‌పై కాల్పులకు పాల్పడ్డారు. బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి మాలిక్ ప్రముఖ నాయకుడిగా ఉన్నారు. కాగా.. బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా అతను కోలుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై సంబంధిత ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ల కింద 307 (హత్య ప్రయత్నం)తో సహా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# బంగ్లా లో తీరం దాటిన రీమాల్ తుఫాన్

**మొదటిపేజీ తరువాయి...**

మరోవైపు రెమాల్ ఆదివారం రాత్రి బంగ్లాదేశాన్ని తీరాన్ని తాకిందని, బెంగాల్ తీరాన్ని దాటే పక్రియను ప్రారంభించిందని అక్కడి అధికారులు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.00-1.00 మధ్య తీరాన్ని దాటిందని, ఆ తర్వాత రెమాల్ తుఫాన్ బలహీనపడుతుందని తెలిపారు. పశ్చిమబెంగాల్ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోల్‌కతా ఎయిర్‌పోర్టు అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటల పాటు విమాన సర్వీసులను రద్దు చేశారు. తుఫాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో 8 లక్షల మందికి పైగా ప్రజలను అక్కడి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ప్రభావంతో ఒడిశా, బెంగాల్, ఈశాన్య రాష్టాల్లో్ర మంగళవారం వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాలపై రీమల్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఓ వైపు ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే అంతలోనే వాతావరణం మారిపోతుంది. తెలంగాణలో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలుల ధాటికి ప్రజలు ప్రజలు చిగురుటాకులా వణికిపోయారు. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో 15 మంది వరకు చనిపోయారు. భారీగా భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు కొమ్ముగుట్టలో వర్షం ధాటికి నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన మల్లేష్ (38), అతని కుమార్తె అనూష (11), పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన కూలీలు చెన్నమ్మ (37) రాములు(40)




అక్కడికక్కడే మృతి చెందారు. మేడ్చల్ జిల్లా తిమ్మాయిపల్లిలో చెట్టుకొమ్మలు విరిగిపడి యాదాద్రి జిల్లా బొమ్మలరామారంనకు చెందిన నాగిరెడ్డి రామిరెడ్డి, ధనంజయ్య దుర్మరణం చెందారు. ములుగు మండలం క్షీరాసాగర్‌లో గోడ కూలి ఇద్దరు మరణించారు. ఈదురుగాలుల ధాటికి కోళ్లఫారం గోడ కూలడంతో గణపురం గ్రామానికి చెందిన గంగ గౌరీశంకర్ (30), చంద్రాయణగుట్టకు చెందిన భాగ్య(40) చుట్టాల వద్దకు వచ్చి మృత్యువాత పడ్డారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ సమీపంలోని మంతటి చౌరస్తా దగ్గర షెడ్డుపై నుంచి సిమెంటు ఇటుకలు పడి వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్ మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన వేణు (34) మృతి చెందాడు. అలాగే నాగర్ కర్నూల్ జిల్లాలో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. బిజినేపల్లి మండలం నంది ఒడ్డెమాన్‌లో రైతు అంజన్‌రెడ్డి (49), తిమ్మాజీపేట మండలం మారేపల్లిలో రైతు కుమ్మరి వెంకటయ్య (55) పొలంలో పనిచేస్తుండగా పిడుగుపాటుకు గురయ్యారు. తెలకపల్లికి చెందిన దండు లక్ష్మణ్ (12) పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్ శివారు హయత్‌నగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. వనస్థలిపురం గణేష్ ఆలయం రోడ్డులో భారీ చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. పలు కార్లు దెబ్బతిన్నాయి. హయత్‌నగర్-1 డిపోలో చెట్టు విరిగి పడడంతో బస్సు ధ్వంసమసైంది. అర్ధరాత్రి వరకు విద్యుత్ లేక చాలా కాలనీల్లో జనం అల్లాడిపోయారు. రాయదుర్గం, గచ్చిబౌలి, టీఎన్‌జీవో కాలనీ, గౌరవెలి ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడ్డాయి.

వర్షం ధాటికి ఐకియా, బయో డైవర్సిటీ, కొండాపూర్ సర్కిల్, గచ్చిబౌలి ఔటర్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. రీమల్ తుఫాన్ దాటికి తెలంగాణలో వర్షాలు కురవగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. పలుచోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ హెచ్చరించారు. తీవ్ర తుఫాన్ ప్రభావంతో ఏపీలోని ప్రధాన ఓడరేవుల్లో ఆదివారం రెండవ నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు నుంచి కాకినాడ వెళ్లే వివిధ వాహనాల రాకపోకలను కొత్తపల్లి మండల పోలీసులు ఆపేశారు. గోర్స, పండూరు, పిఠాపురం మీదుగా కాకినాడ చేరుకోవాలని సూచించారు.

# జగన్ సర్కార్‌పై నిరుద్యోగుల స్పందన

**మొదటిపేజీ తరువాయి...**

అడ్డగోలుగా రాష్ట్రంపై మాఫియా దండెత్తింది. నిలదీసిన వారిని నిలువునా చీల్చారు. ఉద్యోగాల కల్పన జరగలేదు. రాజధాని లేకుండా పోయింది. పోలవరం పడకేసింది. ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని జరగలేదు. అయితే దీనిని ప్రజలు ఎలా స్వీకరించారన్నది తేలనుంది. ఇదే అభివృద్ధి అనుకుంటే ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టివుంటారు. కాదనుకుంటే ఓటర్లు మరో రకంగా స్పందించది ఉంటారు. ఇదంతా మరో ఐదు రోజుల్లో తేలనుంది. ఎన్నికల ముందు డిస్సీ వంటి ఉద్యోగాల ప్రకటన చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్లుగా కాలయాపన చేసి ఇప్పుడు ప్రకటించడం, అది కోర్టుల్లో నలిగి వాయిదా పడడం వంటివి జగన్ అసమర్థతకు నిర్శనంగా చూడాలి. జగన్ ఎన్నికల ఎత్తుగడగా విమర్శలు చేస్తున్నారు. తాము అధికారంలోకి రాకమునుపు, చంద్రబాబు ఏలుబడిలో రాష్ట్రం ఉన్నప్పుడు- ఉద్యోగ, నిరుద్యోగ బృందాల ఆకట్టుకునేలా జగన్ ప్రకటన చేశారు రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, వాటిని భర్తీ చేయకుండా చంద్రబాబు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నలు గుప్పించారు. తాము అధికారంలోకి వచ్చీ రాగానే మెగా డీఎస్సీని ప్రకటించి, అటు పాఠశాల విద్యను, ఇటు ఉపాధ్యాయ అభ్యర్థుల జీవితాలను ఉద్ధరిస్తామని హామీలు గుప్పించారు. కానీ, పీఠం ఎక్కాక ఆ విషయం పూర్తిగా మర్చిపోయారు. ఎన్నికల ఢంకా మోగడానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఎంపిక పక్రియను ప్రకటించింది. మొత్తం 6,100 పోస్టులను భర్తీ చేస్తామని, దశల వారీగా టెట్, ఆ తదుపరి డీఎస్సీ నిర్వహిస్తామని, నోటిఫికేషన్ వెలువరించింది. భారీగా ఆశల కల్పించి వారిమీద నీళ్లు కుమ్మరించిన నిరాశా భావన వారిని ఆవరించింది. అభ్యర్థుల ఆశలకు తగ్గట్టుగా కాక అధికార పార్టీ ఎన్నికల అవసరాలకు తగ్గట్టుగా, తూతూమంత్రంగా ఈ ప్రకటన ఉండటమే అందుకు కారణం. ఏదో ఒక విధంగా నిరుద్యోగులను మభ్యపెట్టడమే జగన్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపించింది. దీనిపై నిరుద్యోగులు ఎలా స్పందిచారన్నది కూడా తేల్చబోతున్నారు. అదే సమయంలో 2025 జూన్ నుంచి అంతర్జాతీయ స్థాయి బోధన అందిస్తున్నామంటూ ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబి) ప్రతినిధులతో ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ విద్యారంగంలోకి ప్రయివేటును చొప్పించటమే అవుతుంది. ఇప్పటికే బైజూస్‌తో ఒప్పందం ఉండనే ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులను కుదించటం, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి కార్పొరేట్లను చొప్పించటం ఆందోళన కలిగించే అంశం. వివిధ వృత్తివిద్యల్లో శిక్షణ పొందిన వారు, ఉన్నత విద్యార్హతలు ఉన్నవారూ అందుకు తగిన ఉద్యోగాల్లో చేరి, స్థిరపడాలనుకోవడం సహజం. కానీ, అందరికీ, అన్నిటికీ సచివాలయ ఉద్యోగ కల్పనే గొప్ప ఘనతగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. గ్రామ సచివాలయాల్లో లక్షా 34 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటోంది. గతేడాది జరిగిన వైజాగ్ సమ్మిట్లో 13 లక్షల కోట్ల పెట్టుబడులతో, 6 లక్షల ఉద్యోగాలను కల్పించే 340 ఒప్పందాలు జరిగాయని సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే అప్పట్లో గొప్పగా చెప్పారు. ఏడాది కాలం గడిచినా అందులో నాలుగో వంతు అయినా అమల్లోకి రాలేదు. ఒకపక్క పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నప్పుడు చేయాల్సింది చేయకుండా తాము చేసిందే గొప్పన్నట్టు ప్రచారం వేసుకోవడం అర్థరహితం. విలీనం పేరుతో వేలాది పాఠశాలలను మూసేసి, పోస్టులను కుదించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, పాఠశాలలకు హంగులూ అలంకరణ, ఇత్యాది అంశాలపై ప్రచారార్భాటం చేశారు. బోధనకు అవసరమైన పోస్టుల భర్తీని మాత్రం సంపూర్ణంగా విస్మరించారు. దీంతో, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐదారు లక్షల మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు మరో ఐదేళ్ల వయసు మీరింది. ప్రభుత్వ ఉద్యోగం పొందగలమన్న ఆత్మవిశ్వాసం వారిలో రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఈ దశలో ప్రభుత్వం ఉన్న ఖాళీలను దాచిపెట్టి, కంటితుడుపు చర్యగా పోస్టుల భర్తీని ప్రకటించటం, అది కోర్టుల కారణంగా ఆగిపోవడం నిరుద్యోగులను మోసగించటమే! ఇవన్నీమొన్నటి ఎన్నికల్లో అంశాలుగా మారాయి. వీటిపై ప్రజలు ఎలా స్పందించారన్నది కూడా తేలనుంది. 4న బాక్సులు విప్పితే ప్రజల మనోగతం ఏంటన్నది సుస్పష్టం కానుంది.

# ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి...**

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సంపూర్ణ ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో తాము దాదాపు 17 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటామనీ విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక సమరంలో దేశవ్యాప్తంగా 400కుపైగా సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సమయం వచ్చేసిందని షా అన్నారు. వాటితో ఎన్నికల వ్యయం దిగివస్తుందని పేర్కొన్నారు. మండే ఎండల్లో కాకుండా, మరేదైనా సమయంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లలోనూ ఈ దఫా కమలదళం ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తుందని జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ వార్తాసంస్థతో ఆయన పలు అంశాలపై మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుతందని అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్ల కాలంలో విస్తృత సంప్రదింపుల అనంతరం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తాము అమలు చేయనున్నట్లు షా చెప్పారు. భాజపా అధికారంలో ఉన్న రాష్టాల్లోన్రే కాకుండా, విపక్ష పార్టీల పాలనలోని రాష్టాల్లోన్రూ ఈ దఫా తమకు మెరుగైన ఫలితాలు వస్తాయని షా ధీమాగా పేర్కొన్నారు. 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో కమలదళం 75 స్థానాలు గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఆ రాష్ట్రంలో 16-17 ఎంపీ సీట్లను తమ ఖాతాలో వేసుకుంటామని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 17, పశ్చిమ బెంగాల్‌లో 24-32 లోక్‌సభ స్థానాలు ఎన్డీయేకు దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. యూసీసీని అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటు, రాష్టా్ర శాసనసభల భుజస్కంధాలపై ఉంచారని షా పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ నిర్దేశిరచిన మూలసూత్రాల్లో యూసీసీ కూడా ఉందని చెప్పారు. తమ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి వచ్చే ఐదేళ్లలో దాన్ని అమల్లోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. సాయుధ బలగాల్లో నియామకం కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. అగ్నిపథ్ కంటే ఆకర్షణీయ పథకం యువతకు ఇంకొకటి ఉండదన్నారు. నాలుగేళ్ల సర్వీసు అనంతరం పదవీవిరమణ పొందే అగ్నివీర్‌లకు రిజర్వేషన్ కారణంగా కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో ఉద్యోగావకాశాలు 7.5 రెట్లు అధికంగా ఉంటాయని తెలిపారు. అగ్నిపథ్‌ను సరిగా అర్థం చేసుకోకుండా.. దాన్ని రద్దు చేస్తామని హామీ ఇస్తున్న రాహుల్‌గాంధీని చూస్తుంటే జాలేస్తోందన్నారు. ఏకీకృత వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని తీసుకొస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇస్తోందని షా తెలిపారు. ధనవంతులు ఉపయోగించే విలాస వస్తువులపై, పేదలు వాడే సరకులపై ఒకే పన్ను రేటును అమల్లోకి తీసుకురావడం ఎలా సముచితమని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో తామేమీ మతం ఆధారిత ప్రచారం చేయడం లేదని షా స్పష్టం చేశారు. ఒకవేళ ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్-370 రద్దును చూపుతూ ఓట్లు అడగడం, యూసీసీని అమలు చేస్తామని చెప్పడం మతం ఆధారిత ప్రచార కార్యకలాపాలే అయితే.. భాజపా అలాంటి ప్రచారం చేసిందని, ఇకముందూ కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఈవీఎంలు, పోల్ డేటాకు సంబంధించి ఈసీపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. భాజపా ఓడిపోయిన తెలంగాణ, కర్నాటక హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్టాల్లోన్రూ ఇప్పుడు అనుసరించిన విధానాలనే ఈసీ అనుసరించిన సంగతిని గుర్తుచేశారు. ఓటమిని ముందుగానే గ్రహించి.. రాహుల్ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే పోలింగ్ విధానంపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందంటూ ఎద్దేవా చేశారు. దేశంలో నక్సలిజం సమస్య అంతమవుతుందని షా ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మరెక్కడా మావోయిస్టులు లేరని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఈసారి వేర్పాటువాదులు కూడా అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని షా అన్నారు.

## సంపాదకీయం

మంగళవారం, మే 28, 2024

# ప్రభుత్వ బడులకు పూర్వవైభవం...!

2024- 25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. పంచాయతీ రాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడలను పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం, పేయింటింగ్ ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ అమ్మ పాఠశాలల పేరిట 2024- 25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించడం అభినందించదగిన విషయం. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో దశాబ్దాలుగా పేయింట్స్ లేకపోవడం, గోడలు పర్రెలు పర్రెలుగా ఊడిపోవడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో తెలియని భయాందోళన పరిస్థితులలో కాలం గడిపేవారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో టాయిలెట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అడ్వాన్స్ గా రూ. 125 కోట్లు విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, పాఠశాలలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పేద, బడుగు, బలహీన, ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ విద్యార్థులను వేలకు వేలు ఫీజుల రూపంలో చెల్లించి ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, సాంఘిక శాస్త్రం చిత్ర పటా లు, గ్లోబులు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ, ఉన్నత రాజ్ పాఠశాలల్లో చేరుటకు మక్కువ చూపుతున్నారు. 2024- 25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. పంచాయతీ రాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడలను పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం, పేయింటింగ్ ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వా లు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి నిర్లక్ష్య, నిర్లిప్తత వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలలు ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలు అంటూ ప్రారంభించి చేర్పించడం వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు లేకపోవడం వలన విద్యా వ్యవస్థ కుంటుపడిపోయింది. బడులు ప్రారంభించే లోగా ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేయాలి. ఎన్నికల కోడ్ జూన్ 4 వ తేదీ వరకు ఉండడం వల్ల కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) అనుమతి తీసుకొని వీలైనంత త్వరగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత పరిపాలనపై దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పడం విద్య, వైద్యానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని అనడంతో ఉపాధ్యాయులు ఎంతో సంతోషిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు స్టే ఇవ్వడం వలన ఆగిపోయింది. కేసు పూర్వాపరాలు పరిశీలించి వాద వివాదాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేసుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వానికి సూచనలు చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉన్న కేసులన్నీ ప్రభుత్వ అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఇప్పుడు బంతి ప్రభుత్వ కోర్టులో ఉంది. గతంలో జిఒ 317 స్థానికేతర సమస్యలు, స్పౌజ్ కేసులు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు పాయింట్లు కేటాయించడం, పదోన్నతుల కోసం టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత, భాషా పండితుల పోస్టులు భాషా పండితులకే ఇవ్వాలని, రంగారెడ్డి జిల్లా లో స్థానికులు స్థానికేతరులు మారడం, సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్ ఉపాధ్యాయులుగా మారిన కేసులు మొదలైన అనేక సమస్యలకు పరిష్కారం తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ద్వారా లభించింది.

# తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఎఫెక్ట్

## - వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి**

వరి కోసిన అనంతరం కొయ్యకాలును కాలపెట్ట రాదని, ఈ విషయాన్ని రైతులకు చేరవేయడంలో బెజ్జంకి మండల వ్యవసాయ అధికారులు విఫలం అవుతున్నారని ఈనెల 23న తెలంగాణ క్యాపిటల్ న్యూస్ మూడవ పేజీలో దుక్కి దున్నడం వల్ల కలిగే లాభాలు ఎన్నో.....? అనే శీర్షికతో కథనం రావడం జరిగింది. దీనిపై స్పందించిన బెజ్జంకి మండల వ్యవసాయ అధికారి సంతోష్ శనివారం రోజు మండలంలోని గుగ్గిళ్ళ , నర్సింహులపల్లి , తలారి వానిపల్లి , బెజ్జంకి , కల్లేపల్లి, గ్రామాలలో ఏఈవోలు రేణుకా శ్రీ, మౌనిక, రచన, భరత్ కుమార్, సాయి శంకర్ లతో సమావేశాలు నిర్వహించడం జరిగింది. అలాగే సోమవారం సైతం మండలంలోని దాచారం, ముత్తన్నపేట, రేగులపల్లి, కల్లేపల్లి, బేగంపేట , లక్ష్మీపూర్, గ్రామాలలో రైతు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వరి కోయ్యలు కాలబెట్టడం వల్ల జరిగే అనర్థాలను స్పష్టంగా తెలిపారు. తెలంగాణ క్యాపిటల్ న్యూస్ లో ప్రచురితమైన వార్తా కథనంలోని అన్ని విషయాలను చదివి రైతులకు వివరంగా వివరించినారు. దీనితోపాటుగా విత్తన కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వానాకాలం నకు అనుకూలమైన విత్తన రకాలను సైతం తెలిపారు . అలాగే వరి, నారు పోసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి , నకిలీ విత్తనాలను, బయట తక్కువ ధరకు లభించే విత్తనాలను, కొనుగోలు చేయరాదని లైసెన్స్ కలిగిన దుకాణాలలోనే విత్తనాలను కొనుగోలు చేయాలని ఏ ఈ ఓ లు ఆయా గ్రామాల రైతులకు సూచించారు . ఈ అవగాహన సదస్సుల వల్ల తమకు స్పష్టమైన క్లారిటీ కలిగిందని,తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కు పలువురు రైతులు కృతజ్ఞతలను తెలిపారు.


దుక్కులు దున్నడం వల్ల
లాభాలు ఎన్నో..!

చీడపీడలు కలుపు నివారణకు దోహదం
లోతు దుక్కులతో భూసారం పెంపు
చీడ పీడలకు చెక్
భూమి కోతకు గురి కాదు
కలుపు మొక్కల బాధ ఉండదు
వానాకాలం పంటలకు సమాయత్తమవుతున్న రైతన్నలు

(తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి/ బూట్ల సూర్యప్రకాష్)

వేసవికాలంలో రైతులు వ్యవసాయ భూముల్లో దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కల నివారణ, చీడపురుగులు నశిస్తాయని , పొలం కూడా మెత్తబడి అధిక దిగుబడి పొందవచ్చని వ్యసాయ శాఖ అధికారుల సూచనతో అన్నదాతలు పనులను మొదలుపెట్టారు. ప్రస్తుతం పొలాలలో ఎలాంటి పంటలు లేనందున , లోతుగా దుక్కులు దున్నుకుంటే ఏ పంట వేసినా అధిక దిగుబడి సాధించవచ్చు. వ్యవసాయ భూముల్లో పంట దిగుబడి చేసుకున్న అనంతరం వెంటనే దుక్కులు దున్నుకుంటే భూమికి బలం చేరుతుంది. ఎండాకాలం పంటల తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చేవరకు రైతులు అవగాహన లేకుండా వ్యవసాయ క్షేత్రాలను దున్నకుండ అలాగే వదిలేస్తున్నారు . దీనితో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని పోషక పదార్థాలను భూమికి సత్తువ లేకుండా చేస్తున్నాయి. అదే వేసవికాలంలో పంటపొలాలలో లోతుగా దుక్కులు దున్నితే పెక్కు లాభాలు ఉన్నాయి. ఇలా చేయడం వల్ల భూమి పై నుండి కిందికి, కింది నుండి పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది.

మొండి జాతి కలుపు మొక్కల నివారణ

వ్యవసాయ భూముల్లో వేసవిలో దిక్కులు దున్ని నప్పుడు కలుపు మొక్కలు ,కాయలు, వేర్లు, దుంపలు పెకిలించబడి వేసవిలో ఉండే ఉష్ణోగ్రతలకు అవి నశించడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది. తర్వాత నేలపైకి తేలిన కాయలు, దుంపలు ఏరి వేసుకుంటే భూమి శుభ్రంగా తయారవుతుంది. తుంగ గడ్డి, గుంజర వంటి మొండి జాతి కలుపు మొక్కలు వ్యవసాయ భూముల్లో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయి. కానీ వేసవిలో లోతుగా దుక్కులు దున్నడంతో వ్యవసాయ క్షేత్రాలలో అన్ని చీడలు నాశనం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

వేర్లు విస్తరించే అవకాశం

వేసవిలో లోతుగా దుక్కులు దున్నితే తొలకరిజల్లు కురిసిన తర్వాత , గొర్రుతిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు , గుంటుక వంటి పరికరాలు నేల లోపలికి మూడు నుండి 6 అంగుళాల వరకు చొచ్చుకొని పోతాయి. ఈ పరికరాలు తరచూ ఉపయోగించడం వలన నేలలోపల సుమారు మూడు నుండి ఐదు అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది . దీనితో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున వేసవి లో వ్యవసాయ దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర చేదించబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది. దుక్కులు లోతుగా దున్నడం వల్ల నేల వదులై మెత్తగా తయారవుతుంది . తొలకరి వర్షాలు పడిన వెంటనే నీరు పల్లం వైపుగా వెళ్లకుండా అక్కడికక్కడే ఇంకి పోతుంది. భూమికి ఎక్కువ రోజులు తేమ నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల పైరు వేసిన తర్వాత వర్షాలు పడడం కొద్దిగా ఆలస్యమైన పంటలకు నష్టం జరగదు. పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదలు, భూముల్లో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుండి రాలిపడిన ఆకుల వంటివి, వివిధ రకాలు సేంద్రియ పదార్థాలన్నీ లోతుగా దుక్కులు దున్నినప్పుడు నెలలో కలిసి కుళ్ళిపోయి ఎరువుగా మారతాయి . దీంతో నేలలో సేంద్రియ పదార్థాలు పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంటుంది. లోతుగా దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వానాకాలానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది అని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు . ముఖ్యంగా వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుగా, అడ్డంగా దున్నడం వల్ల వర్షం నీరు భూమిలోకి ఇంకెందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది.

మందలు పెట్టుకుంటే మరింత లాభం

రైతులు వేసవిలో తమ పంటచేలల్లో పశువుల, గొర్రెల మందలు పెట్టుకుంటే చాలా మంచిది. దున్నే ముందు పశువులు, ఆవులు, గొర్రెల పెంట , కంపోస్ట్ ఎరువు, మట్టిని వేద జల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుంది.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం పది గంటల నుండి మూడు గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మాట్లాడుతూ..

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత



సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# రేవ్ పార్టీ అంటే ఏమిటి.....?

1990 నాటికి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ డాన్స్ పార్టీలలో మద్యంతో పాటు అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయించడవే కాకుండా, యాంఫేటమిన్, ఎల్ఎస్డీ, కెటమైన్, మెథాంఫేటమిన్, కొకైన్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు రహస్యంగా వినియోగించడం ప్రారంభమై రేవ్ పార్టీల విష సంస్కృతి ప్రపంచానికి పరిచయమైంది. భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే పాశ్చాత్య దేశాల రేవ్ పార్టీల సంస్కృతి మన దేశంలో కూడా వ్యాప్తి చెందుతుంది. సెలెబ్రిటీలు, డబ్బున్న బడాబాబులు అక్కడే చదువుకోవటమో.. లేదా తీరిక



సమయాల్లో అక్కడికి వెళ్లి తనివితీరా ఎంజాయ్ చేసి వస్తుండటమో జరుగుతోంది. ఇలా అక్కడున్న కొన్ని కల్చర్ల రుచికి అలవాటు పడిన సెలెబ్రిటీలు, ప్రముఖుల పిల్లలు అదే ట్రెండ్‌ను ఇక్కడ కూడా కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా మన దేశానికి వచ్చిందే ఈ రేవ్ పార్టీ. భారతదేశంలో రేవ్ పార్టీల ధోరణి గోవా నుంచి ప్రారంభమైంది. హిప్పీలు దీనిని గోవాలో ప్రారంభించారు. ఆ తర్వాత ఇటువంటి పార్టీల ధోరణి అనేక నగరాల్లో పెరుగుతూ వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా హిమాచల్‌లోని కులు లోయ, బెంగుళూరు, పూణే, ముంబై వంటి అనేక నగరాలు వీటికి హాట్‌స్పాట్లుగా నిలిచాయి. ఈ పార్టీ కాస్త వైల్డ్ బిహేవియర్‌తో చేసుకుంటుంటారు. ఈ రేవ్ పార్టీ లో పాల్గొనే వారిని రేవర్స్ అని పిలుస్తారు. రేవ్ అన్న పదం జమైకా భాష నుంచి వచ్చింది. చెవులు దద్దరిల్లే మ్యూజిక్తో ఈ పార్టీలలో యువతీ యువకులు ఆల్కహాల్‌తో పాటు డ్రగ్స్‌ను కూడా తీసుకుంటూ.. చీకటిలో లేజర్ లైట్ల వెలుగులో మ్యూజిక్‌ను ప్లే చేస్తుంటే ఒళ్ళు మరిచి వివేకం కోల్పోయి వాయ వరసలు లేకుండా డాన్సులు చేస్తుంటారు. వీరు అన్నీ మరచి చిందులు వేయడానికి ఈ రేవ్ పార్టీలో అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఈ రేవ్ పార్టీ కల్చర్ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు వేదికగా మారుతుంది. రేవ్ పార్టీ సుదీర్ఘంగా సాగే పార్టీ. ఈ పార్టీలో పాల్గొనాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రేవ్ పార్టీలు 24 గంటల నుంచి మూడు రోజుల వరకు నిర్వహిస్తారు. ఒకప్పటి రాక్ ఎన్ రోల్ యుగం, హిప్పీ యుగం, డిస్కో, ర్యాప్ లాగా ఇప్పుడు ఈ రేవ్ యుగం.

# ప్రైవేట్ పాఠశాలలకు ఎంఈఓ మాస్ వార్నింగ్

## - తోక పేర్లు తగిలిస్తే చర్యలు తప్పవు

## - తల్లిదండ్రులు మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు**



రామడుగు మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు ఎంఈఓ వేణు కుమార్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పత్రికా ప్రకటన ఇస్తూ మండలంలోని తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల చివరన తగిలించుకునే తోక పేర్లను చూసి మోసపోవద్దని, అలాగే ప్రభుత్వ అనుమతి లేకుండా నూతనంగా పాఠశాలను ప్రారంభించకూడదని, పాఠశాలలకు ప్రభుత్వ అనుమతి ఉత్తర్వులు లేకుండా ఎలాంటి ప్రచారం నిర్వహించవద్దని, హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్రోచర్స్ వంటి ప్రచార సామాగ్రిని ఉపయోగించి ఆన్లైన్లో గాని, ఆఫ్లైన్లో గాని ప్రచారం నిర్వహించకూడదని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే వివిధ రకాల తోక పేర్లతో తల్లిదండ్రులను ప్రలోభ పెడితే అట్టి పాఠశాల పేరును మా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే అట్టి పాఠశాలపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇది ఇలా ఉండగా మండల విద్యాధికారి పత్రిక ప్రకటన ఇచ్చారు సరేగాని కొన్ని పాఠశాలలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఐఐటీ, నీట్ ఫౌండేషన్ అనుమతులు మా పాఠశాలకే ఉన్నదని బహిరంగంగా ఫ్లెక్సీలు కట్టి మరి ప్రచారం నిర్వహించుకోవడం దానిపై మండల విద్యాధికారి దృష్టి సాధించి అట్టి పాఠశాలల అనుమతులను తొలగించాలని తల్లిదండ్రులు బహిరంగంగా చర్చించుకోవడం కోసమెరుపు.

# శంకరాచారికి విశ్వకర్మ అవార్డు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి**

విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వారు వివిధ రంగాలలో విశిష్ట సేవలు చేసిన పలువురికి విశ్వకర్మ లెజెండ్ అవార్డులను ప్రతి ఏటా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మండలంలోని గుగ్గిళ్ళవాసి, సివిల్స్ మార్గ నిర్దేశకులు నారోజు శంకరాచారికి విశ్వకర్మ లెజెండ్ అవార్డు 2024 సంవత్సరానికి గాను హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు . వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సేవలందిస్తూ ప్రవృత్తి రీత్యా అనేకమంది విద్యార్థులకు, సివిల్స్ పై అవగాహన కార్యక్రమాలతో , పాటుగా ఉచిత శిక్షణ కూడా ఇస్తున్నారు. ఆయనకు అవార్డు రావడం పట్ల బెజ్జంకి మండలం లోని పలువురు ఉపాధ్యాయులు బీ.వీ. ప్రవీణ్ కుమార్ , వడ్లకొండ శ్రీనివాస్, శ్రీరాములు, పుల్లూరి ప్రభాకర్, రామంచ రవీందర్, ఐలేని రజిని రెడ్డి, రవీందర్ రెడ్డి ఓదయ్య లతో పాటుగా పలువురు విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

# లయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ రూరల్:**

వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో లయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల వారు ఒక ప్రకటనలో తెలిపారు.తేదీ 31-05-2024 నుండి 01-06-2024 రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు పూర్తి వివరాలకు లయ యూత్ క్లబ్ అధ్యక్షులు ఎన్ .శ్రీనివాస్ రెడ్డి 9177480716, కె. క్రాంతి కుమార్ 9000449221, ఎస్. ప్రశాంత్ 9989636645, ఎన్. శ్రావణ్ 7780464104, బి. అరవింద్ 630974905 పై నెంబర్లకు కాల్ చేయగలరని తెలిపారు.


# రాజన్న ఆలయ ఈఓ రామకృష్ణ ఆకస్మిక తనిఖీలు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ టౌన్ :**

రాజన్న ఆలయ ఈఓ రామకృష్ణ సోమవారం ఉదయం ముఖ్య ఆలయ కళ్యాణకట్ట, విచారణ కార్యాలయము ,లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ,నందీశ్వర కాంప్లెక్స్ ,గోశాల ,కేదారేశ్వర ఆలయం, మహాలక్ష్మి ఆలయం, తనిఖీలు చేపట్టి ఉద్యోగులు విధులలో నిర్లక్ష్యం వహించరాదని, విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట నాగుల మహేష్ ఎడ్ల శివ సాయి లక్ష్మణ్ ఉన్నారు.


# బాధిత కుటుంబానికి బియ్యం అందచేత



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం**

గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన తేల్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబ సభ్యులను సోమవారం పద్మశాలి సంఘ సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి బియ్యం అందజేశారు. కుమారులు తేళ్ల భాస్కర్, ప్రసాద్, శ్రీనివాసులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తేళ్ల చంద్రశేఖర్, మండల అధ్యక్షులు గుంటుక లింగయ్య, గౌరవ అధ్యక్షులు అంజయ్య, బూర రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి పూర శ్రీనివాస్, ఓడ్నాల నర్సయ్య, తిరుపతి, బూర నర్సయ్య, ఆడేపు శ్రీనివాస్, వెల్ది తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు



తెలంగాణా క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి (సిద్దిపేట)


మహాపురుషులౌతారు తరతరాలకి తరగని వెలుగౌతారు ఇలవేలుపులౌతారు.. అన్న అభియుక్తికి నిలువెత్తు నిదర్శనం అన్న ఎన్టీఆర్. 'నందమూరి తారక రామారావు'.. ఈ మాటే ఓ సంచలనం.. రాజకీయాల్లో ప్రభంజనం.. ప్రతి తెలుగువాడి ఆత్మగౌరవం. ప్రజాహిత పాలనకు నిలువెత్తు రూపం.. సంక్షేమ పథకాలకు తారకమంత్రం అన్న ఎన్టీఆర్. ' తెలుగుదేశం పార్టీ శ్రామికుడి చెమటలో నుండి వచ్చింది. కార్మికుడి కరిగిన కండలల్లో నుండి వచ్చింది. రైతు కూలీల రక్తంలో నుండి వచ్చింది. నిరుపేదల కన్నీటిలో నుండి.. కష్టజీవుల కంటి మంటల్లో నుంచి పుట్టింది ఈ తెలుగుదేశం ఆశీర్వదించండి' అంటూ.. 1982 మార్చి 29న హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కేవలం పదిమంది పత్రికా విలేకరుల మధ్యన 'తెలుగు దేశం' పార్టీని స్థాపించారు. ఆయన పిలుపు ఓ అన్యోపదేశం అయ్యింది.. ఆయన పలుకు ఓ సంచలనమై విరజిల్లింది .. ఆయన ప్రతి మాట ఓ తూటాగా.. ఆయన సందేశమే స్ఫూర్తిగా జనాల్లోకి చొచ్చుకుని వెల్లింది. చైతన్య రథం ఎక్కి ఊరూరా తిరుగుతూ.. పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారాన్ని చేపట్టి.. దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను మట్టికరిపించారు. రైట్ పర్సన్ ఇన్ రైట్ టైమ్ అనే మాటను అక్షరాలా నిజం చేస్తూ.. రాజకీయ శూన్యతను ముందుగానే పసికట్టి, ఢిల్లీ నాయకుల్ని సైతం బెంబేలెత్తించి తెలుగోడి సత్తాను రుచిచూపించారు. నాడు ఎన్టీఆర్ స్థాపించిన 'తెలుగు దేశం పార్టీ' అప్పటి నుండి ఇప్పటి వరకూ రాష్ట్ర రాజకీయాల్లోనూ.. దేశ రాజకీయాల్లోనూ బలీయమైన శక్తిగా ఎదిగిందంటే అది ముమ్మాటికీ అన్న ఎన్టీఆర్ వేసిన పటిష్ఠ పునాదులు... ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు.. అమలు చేసిన సంక్షేమ పథకాలే కారణం.

**బాల్యం-విద్యాభ్యాసం**

1923 మే 28న ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా, పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ దంపతులకు జన్మించారు. పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివాడు. తరువాత విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో చేరాడు. అక్కడ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు విభాగానికి అధిపతిగా వున్నారు. ఒకసారి రామారావును ఒక నాటకములో ఆడవేషం వేయమన్నాడు. అయితే రామారావు తన మీసాలు తీయటానికి 'ససేమిరా' అన్నాడు. మీసాలతోటే నటించడం వలన అతనికి "మీసాల నాగమ్మ" అనే పేరు తగిలించారు. 1940 సంవత్సరంలో కుటుంబానికి అండగా ఉండడం కోసం విజయవాడలో హోటళ్లకు ఎన్టీఆర్ పాలు పోసేవారు. 1942 మే నెలలో 20 ఏళ్ళ వయసులో మేనమామ కుమార్తె అయిన బసవ రామతారకాన్ని పెళ్ళి చేసుకున్నాడు. వివాహో విద్యానాశాయ అన్నట్లు పెళ్ళయిన తరువాత పరీక్షల్లో రెండుసార్లు తప్పాడు. తర్వాత గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. అక్కడకూడా నాటక సంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఆ సమయంలోనే నేషనల్ ఆర్ట్ థియేటర్ గ్రూప్ (నాట్) అనే నాటక సంస్థను స్థాపించి కొంగర జగ్గయ్య, ముక్కామాల, నాగభూషణం, కె.వి.ఎస్.శర్మ తదితరులతో చేసిన ఎన్నో నాటకాలలో పాల్గొన్నారు. తర్వాతి కాలంలో ఈ సంస్థ కొన్ని చిత్రాలను కూడా నిర్మించింది. ఎన్టీఆర్ మంచి చిత్రకారుడు కూడా. రాష్ట్రవ్యాప్త చిత్రలేఖన పోటీలలో అతనికి బహుమతి కూడా వచ్చింది. 1947లో డిగ్రీ పూర్తి చేశారు. తదనంతరం అతను మద్రాసు సర్వీసు కమిషను పరీక్ష రాసాడు. పరీక్ష రాసిన 1100 మంది నుండి ఎంపిక చేసిన ఏడుగురిలో ఒకడుగా నిలిచాడు. అప్పుడు ఆయనకు మంగళగిరిలో సబ్-రిజిస్ట్రారు ఉద్యోగం వచ్చింది. అయితే సినిమాలలో చేరాలనే ఆశయం కారణంగా ఆ ఉద్యోగంలో మూడు వారాలకంటే ఎక్కువ ఉండలేకపోయారు.


**సినిమా రంగ ప్రవేశం**

మొదటిసారి కెమేరా ముందు నటించిన సినిమా మనదేశం.1951లో కె.వి.రెడ్డి పాతాళభైరవి, దాని తరువాత అదే సంవత్సరం బి.ఎన్.రెడ్డి మల్లీశ్వరి, 1952లో ఎల్వీ ప్రసాదు పెళ్ళిచేసి చూడు, ఆ తరువాత వచ్చిన కమలాకర కామేశ్వరరావు చిత్రం చంద్రహారం ఆయనకు నటుడిగా గొప్ప కీర్తిని సంపాదించి పెట్టాయి. 1956లో విడుదలైన 'మాయాబజార్'లో తొలిసారి శ్రీకృష్ణుడిగా నటించి మెప్పించారు. పౌరాణిక పాత్రలకు ఈ చిత్రంతోనే నాంది పలికాడు. ఎన్టీఆర్ క్రమశిక్షణలో చాలా కచ్చితంగా ఉండేవాడు. గంభీరమైన తన స్వరాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ మద్రాసు మెరీనా బీచ్ లో అభ్యాసం చేసేవాడు. నర్తనశాల సినిమా కోసం అతను వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి నృత్యం నేర్చుకున్నాడు. వృత్తిపట్ల ఆయన నిబద్ధత అటువంటిది. కెమెరా ముందు ఎన్టీఆర్ తడబడిన దాఖలాలు లేవని చెబుతూంటారు. ఎందుకంటే ఆయన డైలాగులను ముందుగానే కంఠతా పట్టేసేవాడు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో నటించారు. నటుడిగానే కాకుండా.. నిర్మాతగా, దర్శకుడిగా పలు చిత్రాలను నిర్మించారు. రామారావుకు సొంత కుర్చీ తెచ్చుకోవడం అలవాటు. ఆయనకంటే ముందే సెట్‌లోకి కుర్చీ వచ్చిందటే రామారావు వస్తున్నట్లే. వెంటనే సెట్లో వాళ్లంతా అలర్ట్ అయి లేచి నిలబడేవారు. తన కుర్చీమీద ఎన్.టి.ఆర్ పేరు అందంగా కుట్టివుండేది. కుర్చీతోబాటు ఒక కంచు మరచెంబు నిండా మంచి నీళ్ళు, గ్లాసు, వెండి కంచం వచ్చేవి. అవసరమైతే ఇంటి నుంచి మంచినీళ్ల బిందె కూడా వచ్చేది. మంచి నీళ్లలో తేనె కలుపుకొని తాగడం రామారావుకి అలవాటు. ఎన్.టి.ఆర్.గురించి చాలా మందికి తెలియని విశేషమైన గుణం ఉంది. ఆయన దేన్నీ పట్టించుకోనట్లు ఉంటారు గాని ప్రతి అంశాన్ని మైక్రోస్కోపిక్ లెన్స్‌లో చూస్తారు. సమయపాలన ఆయన ఆరో ప్రాణం. ఉదయం నాలుగున్నరికి కలుద్దాం బ్రదర్ అంటే ఆ సమయానికి ఆయన కుర్చీలో సిద్ధంగా వుంటారు. సంబంధిత సమాచారంతో కలుసుకోవలసిందే. ఆయన్ని ప్రసన్నం చేసుకోవడం చాలా కష్టం. పంక్చువాలిటీకి ప్రాణమిస్తారు. ఆయనకు మంచి ధారణ శక్తి ఉంది. కిందటి రోజున ఏ సందర్భంలో చర్చ ఆగిపోయిందో సరిగ్గా అక్కడి నుంచే చర్చ ప్రారంభించేవారు. ఆయన సునిశిత పరిశీలన గురించి ఓ విషయాన్ని చెప్పాలి. హీరో తన ఫ్రెండ్స్‌తో కలిసి క్లబ్‌కి వెళతాడు. మందు తాగుతుంటారు. ఇంతలో ప్రతి నాయకుడు కనిపిస్తాడు. దానికి ఆయన పక్కనే పెన్సిలుతో "హీరో ఫ్రెండ్స్ మందు తాగవచ్చును. హీరో మందు తాగుతున్నట్లు నటించి పక్కనే వున్న ఫ్లవరు వాజులో పారబోయవలయును" ముత్యాల్లాంటి అక్షరాలతో సున్నితంగా సవరించేవారు. కథలో హీరోతో సమానంగా ప్రతి నాయకుడ్ని స్వీకరించేవారు. విలన్ అని రాస్తే ప్రతి నాయకుడు అని సరిదిద్దేవారు. హీరో అనేవాడు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా వుండేవాడు, ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదు అనేవారు. ఆయన స్క్రిప్ట్‌ని ఫైనలైజ్ చేసే విధానం చిత్రంగా వుంటుంది. స్క్రిప్ట్ పూర్తయ్యాక యూనిట్‌ని పిలిచి కవిగారి చేత చదివి వినిపించేవారు. వారి స్పందనను నిశితంగా పరిశీలించేవారు. ఒకరికి తెలియకుండా మరొకరి అభిప్రాయాలను కూడా సేకరించేవారు. ఆ స్క్రిప్ట్ తృప్తిగా అనిపిస్తే పక్కన పెట్టేవారు. మళ్ళా ఆరు మాసాల తర్వాత మరో షూటింగ్ అప్పుడు కూడా అదే స్పందన అదే ఆనందం యూనిట్ బృందం వ్యక్తపరిస్తే అప్పుడు ఆ స్క్రిప్ట్‌ని చిన్నాయనకిచ్చి చదివి బైండు చెయ్యమనేవారు. చిన్నాయన అంటే త్రివిక్రమరావు. అయిదున్నర గంటలకు మేకప్‌మేన్ పీతాంబరం లేదా ఆయన సహాయకుడు ముత్తు వచ్చేవాడు. కాస్ట్యూమర్ మోక రామారావు. ఆయన అసిస్టెంట్ బాబూరావు, డ్రైవర్ కృష్ణ అంతా సిద్ధంగా ఉండేవారు. మేకప్‌ని ఓ పవిత్రమైన కార్యంగా భావించేవారు. బొట్టు పెట్టగానే ఆ నటరాజస్వామిని తలచుకుంటూ మౌనంగా ధ్యాన




## నటుడి నుండి నాయకుడిగా ఎదిగిన యుగ పురుషుడు ఎన్టీఆర్

ముద్రలో వుండిపోయేవారు. పౌరాణిక చిత్రాల్లో కృష్ణుడు, రాముడు, రావణుడు, దుర్యోధనుడు, కర్ణుడు, భీష్ముడు ఏ పాత్రలు వేసినా మాంసాలకు దూరంగా ఉండేవారు. సహ నటులను కూడా అంతే నిష్ఠగా ఉండమని చెప్పేవారు. మేకప్ వేసుకున్నది మొదలు షూటింగు పేకప్ చెప్పేటంత వరకూ అలంకారం తీసేవారు కారు. ఆ బరువు మోసి తీరవలసిందే! ప్రతిరోజు ఓ అరగంట సమయం నిర్మాతల కోసం కేటాయించేవారు. నిర్మాతల యోగ క్షేమాల్ని అడిగి తెలుసుకోనేవారు. ఆయన తరచు అంటుండేవారు "బ్రదర్ ఈ లోకంలో ఎవడు చెడి పోయినా తెలివితేటలు ఎక్కువై చెడి పోడు. అమాయకుడు, నిజాయితీపరుడు ఎప్పుడూ చెడిపోలేదు. చేసిన తప్పులు దిద్దుకోవడం గొప్పతనం. అటువంటి వారికే నా దగ్గర చోటు!" అనేవారు. తిరుపతి వెళ్ళొచ్చిన టూరిస్టు బస్సులన్నీ ఎన్.టి.ఆర్ ఇంటి ముందే ఆగేవి. ఒక పది బస్సులు పోగయ్యాక బైటికి వచ్చి అందర్నీ ప్రేమగా పలకరించి కుశల ప్రశ్నలు వేసి ఆ అభిమానులతో తనివి



తీరేలా మాట్లాడేవారు. రైతులు వస్తే నాట్లు వేసింది మొదలు కోతల వరకు సమాచారం అడిగి తెలుసుకొనేవారు. వ్యవసాయ దిగుబడి మీద మంచి అవగాహన వుండేది. ఎనిమిదిన్నరయితే షూటింగ్‌కి బయల్దేరేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండేవారు. ఆయన బైటికి వచ్చినప్పుడు వాకిలికి ఇరువైపుల సింహాల మధ్యలో రారాజులా కనిపించేవారు. బసవరామ తారకమ్మ ఎదురొచ్చేవారు. పుండరీకాక్షయ్య, బలరామయ్యలు ఎస్కార్ట్‌లుగా ఉండేవారు. ఎన్.టి.ఆర్. బావమరిది రుక్మాందరావు ఆగమేఘాల మీద ఎన్.టి.ఆర్ ఆదేశాల్ని అమలు చేసేవాడు. ఎన్.టి.ఆర్. దగ్గర ఏ వ్యవహారం అయినా 'క్రియ' ప్రధానంగా వుండి తీరాలి. రిజల్ట్ ఓరియంటెడ్‌గా ఉండాలి. సెట్‌లో ఎన్.టి.ఆర్. పని చేసే విధానం నేటి తరానికి ఆదర్శం. ఫ్లోర్‌లో అడుగుపెట్టింది మొదలు లంచ్ బ్రేక్ వరకూ తనూ కూర్చోరు. యూనిట్‌లో ఎవర్నీ కూర్చోనివ్వరు. పని..పని..పని ప్రొడ్యూసరు పెట్టిన ప్రతి రూపాయికి నటీనటులు సాంకేతిక నిపుణులు జవాబుదారీగా ఉండాలన్నది ఆయన సంకల్పం. సాయంత్రం ఇంటికి రాగానే మళ్ళీ స్నానపానాదులు ముగించి మళ్ళీ దర్బారులో కూర్చుంటారు. వరుసగా ప్రొడ్యూసరు బాగోగులు, కొత్త సినిమాకు సంబంధించిన కథలూ మధ్య మధ్యలో వేడివేడి



పకోడీలు, వేరుశెనగకాయలు, పప్పు, బెల్లం, స్వీట్లు . తిరుపతి కళ్యాణం లడ్డు, తిరుపతి జిలేబీ, తాపేశ్వరం కాజా, కాకినాడ కాజా, బందురు లడ్డూ, ఆత్రేయపురం పూతరేకులు అన్నీ స్పెషల్ ఐటమ్స్ చోటు చేసుకునేవి. కేవలం ఎన్.టి.ఆర్‌ని ఆశ్రయించుకుని కొంతమంది నటీనటులూ సాంకేతిక నిపుణులు ఉండేవారు. వారి స్థితిగతులను తెలుసుకొని అక్కడికక్కడే వారి సమస్యను పరిష్కారం చూపించేవారు. ప్రబంధ కవులందర్నీ చదివారు. సమకాలీన సాహిత్యం మీద మంచి పట్టు ఉంది. పోతన గురించి ఎంత అనర్గళంగా మాట్లాడగలరో ....శ్రీశ్రీ గురించి అంతే సున్నితంగా చెప్పగలరు. ఎన్.టి.ఆర్. పాత్రలను చదివి నెమరు వేసుకోవడం గాకుండా ఆ పాత్రలను పరిశోధన చేసి ఇలాగే ఎందుకు ఉండాలి, ఇలా ఎందుకు ఉండకూడదు అని రీసెర్చ్ చేసి అప్పుడు ఆయా పాత్రలను ఆవిష్కరించేవారు.

**రాజకీయ ప్రవేశం**

1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎన్టీఆర్ ప్రజలను చైతన్య పరుస్తూ చైతన్యరథంపై ఆంధ్ర ప్రదేశ్ నలుమూలలకూ ప్రచార యాత్రను సాగించాడు. ఎన్నికల్లో విజయం సాధించి ఆంధ్ర ప్రదేశ్ లో మొదటి కాంగ్రేసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత అతను ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడు. పేదవాడి కడుపు నింపే రెండు రూపాయలకు కిలోబియ్యం, సగం ధరకే చేనేత వస్త్రాలు, రైతన్నకు సబ్సిడీపై విద్యుత్ తదితర ప్రజాకర్షక, ప్రజాసంక్షేమ పథకాలు తిరుగులేని విజయాన్ని అందించాయి. ఆడిన మాట తప్పని "అన్న"ఎన్‌టిఆర్ అధికారంలో కొనసాగినంత కాలం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. 1989 ఎన్నికల్లో ఓటమి చెందారు.1994లో గెలిచి మళ్ళీ అధికారంలోకి వచ్చారు.తెలుగు దేశం పార్టీలో అంతర్గత పరిస్థితుల కారణంగా ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. అంతటితో ఎన్టీఆర్ రాజకీయ జీవితం ముగిసినట్లయింది. తర్వాత 1996 జనవరి 18న 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో ఎన్టీఆర్ మరణించాడు.

**బుద్ధుడి విగ్రహం**

ఎన్టీఆర్ ఒకసారి న్యూ యార్క్ వెళ్లినప్పుడు అక్కడి స్టాట్యూ అఫ్ బర్టీని చూసి మైమరచిపోయారంట. అలాంటి విగ్రహం హైదరాబాద్‌లో కుడా ఉండాలని ట్యాంక్ బండ్ దగ్గర ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని నెలకొల్పారు.

**సమయస్ఫూర్తి**

ఎన్టీఆర్ కృష్ణుడు, రాముడు, వెంకటేశ్వరుడు లాంటి పురాణ పాత్రలు చేసిన సినిమాల్లో ఎడమచేతితోనే ఆశీర్వదించేవారు, అభయం ఇచ్చేవారు. అలా ఎందుకని చాలా మందికి సందేహం ఉండేది, కొందరు ఆయన్నే డైరెక్టుగా అడిగారు కూడా. దానికి ఎన్టీఆర్ స్పందిస్తూ.. "మన హృదయం ఉన్నది ఎడమవైపు. పూజలలో భార్యను ఎడమవైపే కూర్చోబెట్టుకుంటాం. మన శరీరంలోని మాలిన్యాన్ని శుభ్రం చేసేది కూడా ఎడమ చెయ్యే. ఎడమ భాగానికున్న ప్రాధాన్యత కుడి భాగానికి లేదు. అందుకే ఎడమ చేతితోనే ఆశీర్వదిస్తున్నాను" అన్నారట.. అవతలివారు ఆశ్చర్యపోయాక అసలు గుట్టు విప్పేవారట ఎన్టీఆర్. సినిమాల్లో తీసే ప్రకటనలు, ఫైటింగుల వల్ల, ఒక రోడ్డు ప్రమాదం వల్ల ఎన్టీఆర్ కుడిచెయ్యి నాలుగు సార్లు విరిగింది. వరుస ప్రమాదాలతో కుడిచేయి పట్టు తప్పడంతో ఎడమచేత్తోనే దీవెనలు ఇవ్వడం ప్రారంభించారట ఎన్టీఆర్.

**ముఖ్యమంత్రి హోదాలో పెళ్లి పెద్దగా ఎన్టీఆర్!**

ఎన్టీఆర్ స్వయంగా ఓ పెళ్లికి పౌరోహిత్యం వహించారన్న సంగతి అతి తక్కువమందికి మాత్రమే తెలిసిన విషయం. అదీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న సమయంలో పెళ్లి పెద్దగా వ్యవహరించడం విశేషం. ఆయన పౌరహిత్యంలో ఒక్కటైన ఆనాటి వధూవరులు నాగభైరవ వీరబాబు. జూలై 7, 1988... ఉదయం 6గంటల 40 నిమిషాలకు వివాహ ముహూర్తం... ఒంగోలు పట్టణం రాంనగర్‌లోని టొబాకో సంస్థ ప్రాంగణంలో కళ్యాణ వేదిక. వధూవరులను ఆశీర్వదించడానికి హాజరైన ఎన్టీఆర్ "కవి గారూ" అంటూ నాగభైరవ కోటేశ్వరరావు (పెళ్లికొడుకు తండ్రి)ని దగ్గరకు పిలిచి చెవిలో ఏదో చెప్పారు. అప్పటిదాకా వేదికపై ఉన్న పురోహితుడు వేదిక దిగాడు. ఆయన స్థానంలో ఎన్టీఆర్ ఆశీనులయ్యారు. అక్కడున్నవారంతా ఒక్కసారిగా షాకయ్యారు. సర్వత్రా ఏం జరగబోతోందనే ఉత్కంఠ. ఎన్టీఆర్ మైక్ అందుకున్నారు. "సంస్కృతంలో ఉన్న వివాహ మంత్రాల అర్థం వీరికి తెలీదు. భార్యాభర్తల అన్యోన్యత, దాంపత్యం గురించి వివరించే ఆ మంత్రాల పరమార్థాన్ని మనకు అర్థమైన తెలుగులో చెప్పి ఈ పెళ్లి నేనే జరిపిస్తాను" అన్నారు. వివాహవ్యవస్థ ఔన్నత్యాన్ని, సప్తపది, తాళి పరమార్థాన్ని అచ్చమైన తెలుగులో వివరించారాయన. మా చేత పెళ్లి ప్రమాణాలు చేయించారు. "ఆ! మేళగాళ్ళూ కానివ్వండి.!" అంటూ ఆయనే స్వయంగా బాజాభజంత్రీలను పురమాయించారు. ఎన్టీఆర్ గారు పెళ్లి మంత్రాలన్నింటినీ కంఠతా ఆలపించడం విశేషం.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన 'వివాహ విధి' గ్రంథం ఆధారంగా ఎన్టీఆర్ వివాహ మంత్రాల అర్థాన్ని వివరిస్తూ, విపులీకరిస్తూ వధూవరులతో ప్రమాణాలుచేయించారు. సప్తపది, జీలకర్ర బెల్లం, మంగళసూత్ర ధారణ పవిత్రను, పరమార్థాన్ని వివరించారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌ని ఆయన సన్నిహితులు చాలామంది పెళ్లి పెద్దగా హాజరవ్వాల్సిందిగా విన్నవిస్తే "కవిగారిపై నాకున్న అభిమానంతో వారి కుమారుడి వివాహానికి పౌరోహిత్యం చేశాను. ఆ అవకాశం వారికి మాత్రమే సొంతం" అని అన్నట్లు 'నందమూరితో నా అనుభవాలు' పుస్తకంలో నాగభైరవ కోటేశ్వరరావు రాశారు. చిత్రజగతి, చిత్రవిచిత్ర రాజకీయ రణస్థలిలోనూ రాణకెక్కిన రాణ్మౌళి. సరస సమ్మోహన రూపం, నవ నవోన్మేష ప్రతిభా భాస్వంత చైతన్య స్వరూపం నందమూరి తారకరామ నామధేయం. ఆయన జీవితం ధ్యేయానికి కట్టుబడినఅధ్యాయం.

నటుడు, నిర్మాత, దర్శకుడు, నాయకుడు, ప్రతినాయకుడు, ప్రతిపక్షనాయకుడు, చిత్రకారుడు. చిత్ర జీవితంలోనే కాదు, నిజజీవితంలోనూ ఇన్ని పాత్రలు పోషించి, శాసించి, భాసించిన ప్రభంజనుడు. ఎన్టీఆర్ ఈ భూమి మీద లేకపోయినా తెలుగు ప్రజల గుండెల్లో ఇంకా బతికే ఉన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన తారక రాముడి ఖ్యాతి తెలుగు వెలుగు ఉన్నంత కాలం శాశ్వతం.